"విచక్షణ తెలియనిది ఎవరికి? నీకా? నాకా? పదిరోజులు పోకుండానే కూతురు పెళ్ళిమాటలకు వచ్చిన నీకా? నాకా? తోబుట్టువు సొమ్ము ఆశించడం కుక్కకన్నా హీనం అని మర్చిపోకు."

వీరభద్రం కోపంతో ఉడికిపోయాడు. జేవురించిన మొహంతో వీధినిబడ్డాడు. మళ్ళా తిరిగి రాలేదు. వీరభద్రం వెళ్ళిపోవడంతో అంతా జారుకున్నారు క్రమంగా.

"అమ్మాయీ! అంతా వెళ్ళిపోయారనా అలా చూస్తున్నావు? లేక నేను...సరేలే. పెద్ద ఆస్తిటమ్మా ఇంకొకారు చూడ్డానికి? నువ్వు పదెకరాలుచూసుకో లేని అర్భకురాలవని నేను అనుకోను. ఊళ్ళో హైస్కూలుంది పిల్లవాని చదువుకు. నీకొచ్చిన ఇబ్బందేమీ లేదు. ఎవర్నీ చేరదియ్యకు, నన్ను కూడా!"

"తమ్ముడూ!" ఎంతో ఆదరంగా అంది. "వస్తానమ్మా" అంటూ వెళ్ళిపోయాడు సత్యమూర్తి వీధిలోకి. సత్యమూర్తి పోయినవైపు చూస్తూ చాలాసేపు గుమ్మంలో ఉండిపోయింది సుభద్రమ్మ!

---

స్కెచ్

# కల్యాణి నవ్వుకుంది

"ప్రఫుల్ల"

ఎదురుగుండావున్న నిలువుటద్దంలో తన రూపం ఓసారి చూసుకుంది కల్యాణి. తనకే అసహ్యమనిపించింది. తనేం పాపం చేసింది? ఎందుకు దేవుడు తనను ఇలా సృష్టించాలి? తనపాటి తెలివితేటలున్న అమ్మాయి ఏ యువక హృదయాన్ని కుతకుత లాడించదు? ఏం ప్రయోజనం? జీవితం చాలిద్దామన్న ఆలోచన, ఆత్మహత్య కర్తవ్యమన్న వూహ, లోగడ చాలసార్లు కలిగాయి. కానీ, జీవితంలో అందమేనా ప్రధానమని జీవిస్తూంది.

కల్యాణి ఎంతో మంచి అమ్మాయి. అసలు కల్యాణికి తను మంచి పిల్లనిపించుకోడంలో ఏపాటి కష్టమూ అనిపించలేదు. ఆ మాటకొస్తే అలా అనిపించుకోడం తప్ప వేరే మార్గంకూడా లేదాయె. కల్యాణి వయస్సు పద్ధెనిమిదేళ్లు; కాని చూడ్డానికి ఏ ఇరవై ఎనిమిదో ముప్పైయో వున్నట్టు కనిపించేది. కాగా, కల్యాణికూడా చాల పెద్దవాళ్ళలాగే ప్రవర్తించేది. పొట్టిగా కొంచెం బొద్దుగా వుండేది. ఆమె నల్లటి కోలముఖాన్ని ఆ స్ఫోటకం మచ్చలు కసిదీరా పాడుచేశాయి. ఆ బంగారు కళ్ళద్దాల ఫ్రేము శరీర వర్ణాన్ని మరీ అసహ్యంగా ప్రదర్శిస్తూ వుంటుంది. కల్యాణి తలకట్టుకూడా కురుచగా ఉంటుంది. దానికి తోడు కల్యాణి మరీ ఎక్కువగా నూనె పట్టించి మాడుకు అతుక్కుపోయేట్టు దువ్వేది. శరీరంలో వంపులసలు లేవు.

కాని, ఈ వికృతాకారాన్ని కప్పిపుచ్చడంలో కల్యాణి తెలివితేటలు చాలా పనిచేశాయి. క్లాసులో కల్యాణి ఫస్టు. ఆమె చాలా కష్టపడి చదివేది. ఆ విపరీత శ్రమను ఆ కళ్ళద్దాలే తెలియజేసేవి. తల్లిదండ్రులకు ఎప్పుడూ ఆమె భారమనిపించలేదు. తెల్లారిలేచి యింటి పనులన్నీ చక్కగా చేసి మరీ సైకిలుమీద కాలేజీకి వెళ్ళేది. కాలేజీలో చెప్పే విషయాలు శ్రద్ధగా మననంచేసుకొని యింటికొచ్చేది. అనవసర విషయాల్లో జోక్యం చేసుకునేదికాదు. కల్యాణిని ఒకరు ప్రేమించలేదు; ఆమె ప్రేమకోసం అర్రులు చాచలేదు.

సరికొత్త ఫాషన్‌లపై కల్యాణికి ఆసక్తిలేదు. కాలేజీ కుర్రాళ్ళతో మాట్లాడిందిలేదు. ఎగతాళి చేస్తారని సాధ్యమైనంతవరకూ తప్పించు తిరిగేది. దేవుడిచ్చిన అందంతోనే తృప్తిపడాలనీ, స్నోలు, పౌడర్లూ తనకోసంకాదనీ కల్యాణి ఏనాడో తెల్సుకుంది. దయ, కారుణ్యం మానవజాతి ప్రథమ లక్షణాలని ఆమె విశ్వాసం. ఫలంకోసం ఆశపడకుండా కష్టపడడం చాలా ముఖ్యమని ఆమె దృఢ నమ్మకం. కల్యాణికి తన యీడు స్నేహితులు లేరనే చెప్ప

వచ్చు. పెద్దవాళ్ళలో కల్యాణి చాలా కలుపుగోలుగా వుండేది. తన వయస్సువాళ్ళు తన్నెవరూ లెక్కచేయక పోవడంవల్లే కల్యాణి ప్రకృతి శక్తులను నమ్ముతూవచ్చింది.

కల్యాణి పందొమ్మిదో పుట్టినరోజు పండుగకు ఆమె తరగతి పిల్లలు లిప్‌స్టిక్, సెంట్, క్రీం, బహుమానంగా యిచ్చారు. తన అందాన్ని ఎగతాళి చేయడానికే యిలా యిచ్చారని కల్యాణి ఎంతో బాధపడింది. వాటిని డ్రాయర్లో జాగ్రత్తగా దాచి, వాళ్ళందరికీ వీధిలో విసిరేశానని చెప్పింది. ఆ కోపంలో అద్దం గోడవైపు తిప్పేసింది యిక మొహం చూసుకోరాదని.

ఆ రోజు పరీక్ష లయిపోయాయి. అందరూ యిళ్ళు కెడుతూన్నారు; తన స్నేహితురాండ్రు కొందరు పెళ్ళిళ్ళు కూడా చేసుకోబోతూన్నారు. తను అటువంటి ఆశలు పెట్టుకుని ప్రయోజనం లేదని కల్యాణికి తెలుసు. కాని, మనసు ఆ తీయటి వూహాల్లోనే మరీమరీ విహరిస్తూంది.

ఇంటికొస్తూ రోడ్డు మలుపులో 'ధబీ'మని పరధ్యాన్నంగా సైకిలుతో ఎదురుగుండా వచ్చే పళ్ళబ్బాయిని గుద్దేసింది. ఇహ లోకంలోకి వచ్చేసరికి ఎదురుగుండా బుట్టలోని పళ్ళన్నీ చిందర వందరగా పడివుంటే, వాటిమధ్య నిల్చొని తనవేపు చూస్తూన్న ఆ అబ్బాయి కనిపించాడు. బొత్తాములు లేని ఆ చొక్కా యవ్వనంతో మెలితిరిగిన కండరాలను వుబ్బొంగిన ఛాతిని చూపుతూంది. ఎందుకోగాని వాడు చిరునవ్వుతోనే కల్యాణి వైపు చూస్తూ వుండిపోయాడు.

"కళ్ళు లేవూ...అలా కళ్ళు మూసుకుని సైకిలు కింది కొస్తావేం?..." అంది, తప్పంతా వాడిపైనే వేస్తూ, సైకిలు పైకెత్తుతూ.

"అదే!...ఒకే కన్నే వుంటా!" అన్నాడు వెధవ నవ్వుతూ..కొంటెగా మరోకన్ను మూశాడు.

కల్యాణికి ఒళ్ళు మండిపోయింది.

"ఛీ!...గాడిదా..."అంటూ రుసరుసలాడింది. మిట్టమధ్యాహ్నం...రోడ్డులో జనసంచారం లేదాయె...వాడు అటూ యిటూ చూసి...నవ్వుతూనే,

"గాడిదా!...అసలు గాడిదను చూశారా?..." అంటూ కొంటెగా ఒక కన్ను మూసి కుడి చేతితో ఎడమ మోచేతిని పైకీ క్రిందికీ కదిలించాడు నవ్వుతూనే...

"ఛీ!..." అంటూ సైకిలుమీద గబగబ వెళ్ళిపోయింది కల్యాణి.

ఇంట్లోకి తిన్నగా వెళ్ళి పరుపులో తలపెట్టి వెక్కివెక్కి ఏడ్చింది. తననింతవరకూ ఒక్కరూ ఆ విధంగా అవమానించలేదు. ఎంత పనికిమాలినవాడు కాకుంటే అలాంటి అసహ్యమైన చేష్టలు ఆడవాళ్ళముందా?...వెధవని చంపిపారేయవలసింది... ఏడ్చిఏడ్చి, ఒక్కసారి దబుక్కున ఆపేసింది. ఎందుకు వాడలా చేశాడు?...అందులో తనను చూసా? ఇంతవరకూ తనతో తిన్నగా మాట్లాడిన యువకు డెవడూ లేడే? అందులో వీడు నవ్వుతూ చాలా తమాషాగా మాట్లాడాడు. కొంపతీసి తను వాడినేమైనా ఆకర్షించిందా?...వాడికి తనలో ఏమైనా అందం కనిపించిందా?...మరోకసారి, నవ్వుతూ వాడు చేసిన కొంటె చేష్టలు కల్యాణి కళ్ళముందు కనిపించాయి... ఈ వూహ ఎప్పుడైతే వచ్చిందో అదే నిజమనిపించింది కల్యాణికి. అదే నిజమనిపించిన కొలదీ ఆమె హృదయం ప్రశాంతత వహించింది. వానిపై ఒక విధమైన మక్కువ మొలకెత్తింది.

గబుక్కున మంచంపైనుంచి లేచి శుభ్రంగా మొహం కడుక్కుంది కల్యాణి. తల ముడుపులాగ దువ్వుకోక, ఫాషన్‌గా చెరుపుకుంది. తోటలో ఓ గులాబీపువ్వు కోసి సొంపుగా కుడివైపు గ్రుచ్చింది. సొరుగులో దాచిపెట్టిన లిప్‌స్టిక్ తీసి పెదవులకు రాసింది. పౌడర్ క్రీంతో సహా ముఖానికి రాసుకుంది. వయ్యారంగా అద్దంవేపు తిరిగింది. గోడవేపు త్రిప్పివుంచిన అద్దాన్ని మళ్ళీ తనవైపు తిప్పుకుంది.

పెదవిచివర చిరునవ్వు మొలకెత్తింది. "ఎలా వున్నాను?" అనుకుంటూ ఆనందంగా చూచింది అద్దంలోకి.

నల్ల కళ్ళతో రోజాపువ్వు గ్రుచ్చుకున్న ప్రతిబింబం "బాగానే వున్నావు సుమా!..." అంది ఆశ్చర్యంగా.

తన వెనకాతలే ఆ పళ్ళు అమ్మే అబ్బాయి నవ్వుతూ కొంటెగా కనిపించాడు. గబుక్కున వెనక్కు తిరిగింది. ఎవ్వరూ లేరు. తనలో తనే నవ్వుకుంది కల్యాణి.

★